
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంజాన్ వేళలు శుక్రవారం(ఇఫ్తార్-6:33)। శనివారం (సహెర్-5:04)

ఎమ్మెల్సీ పోరులో మిగిలింది.. ముగ్గురే

- 10 మంది నామినేషన్ల ఉపసంహరణ
- అభ్యర్థుల ఉపసంహరణలో కాంగ్రెస్ దూకుడు
- కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి
- బీఆర్ఎస్ నుంచి నవీన్‌రెడ్డి.. స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్

మహబూబ్‌నగర్, మార్చి 14 : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో నిలిచే అభ్యర్థులెవరో తేలిపోయింది. 16 మంది నామినేషన్లు దాఖలు చేస్తే ఈ నెల 12న జరిగిన పరిశీలనలో ముగ్గురి నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన 13 మందిలో గురువారం సమయం ముగిసే వరకు 10 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మిగిలిన వారిలో కాంగ్రెస్ పార్టీనుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ పోటీలో ఉన్నారు. నామినేషన్ ఉపసంహరించుకున్న వారిలో. స్వతంత్ర అభ్యర్థులు మున్నూరు రవి, గడీల కుమార్‌గౌడ్, ఎస్ కృష్ణ, గవినోళ్ల బలరాంరెడ్డి, మంగి విజయ్, సుమలత, శంకర్‌నాయక్, మహ్మద్ రహీంఖాన్, దేవీ రవీందర్, కొండా సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

పట్టు బిగిస్తున్న కాంగ్రెస్

ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ పట్టుబిగిస్తోంది. 10 మంది అభ్యర్థుల నామినేషన్లు ఉపసంహరించుకోవడంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల హస్తం ఉంది. అభ్యర్థులను ఆయా ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు సమన్వయం చేసుకుని నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేశారు. మాగనూర్‌కు చెందిన సుదర్శన్‌రెడ్డి కూడా తన నామినేషన్‌ను ఉపసంహరించుకునేందుకు సుముఖంగా ఉన్నా చివరికి సమయం సరిపోకపోవడంతో ఆయన పోటీలో ఉండాల్సి వచ్చింది.. ఇక ప్రధాన పార్టీల అభ్యర్థులైన జీవన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి మధ్యనే పోరుసాగనుంది. సంఖ్యాబలం బీఆర్ఎస్‌కే ఎక్కువగా ఉన్నా కాంగ్రెస్ ముందునుంచి దూకుడు ప్రదర్శిస్తోంది. బీఆర్ఎస్‌లో మాత్రం నిర్లిప్తత కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డితోపాటు ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ ఓటర్ల మద్దతు కూడగట్టడం, లేదంటే పార్టీలో చేర్చుకోవడంతో తమ బలాన్ని పెంచుకుంటున్నారు. బీఆర్ఎస్ మాత్రం తమ పార్టీ శ్రేణులను కాపాడుకోలేపోతోందన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఎన్నికలపై కాంగ్రెస్ పట్టు సాధిస్తోందన్న విషయం స్పష్టమవుతోంది. నామినేషన్ల రోజే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా మంత్రి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కౌన్సిలర్‌లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు కలిసిరాగా, బీఆర్ఎస్ మాత్రం ఇద్దరు ఎమ్మెల్యేలతో వచ్చి నామినేషన్ దాఖలు చేసింది. నామినేషన్‌ల తరువాత కూడా స్తబ్దుగానే ప్రచారం సాగుతోంది ఈనెల 28న ఎన్నికలు జరగనుండడంతో ప్రధాన అభ్యర్థులు శిబిరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎన్నికల నాటికి ఏ పార్టీలో ఎంతమంది ఉంటారో వేచి చూడాలి.



మన్నె జీవన్‌రెడ్డి

నవీన్‌రెడ్డి

సుదర్శన్‌గౌడ్

కాంగ్రెస్‌తోనే స్థానిక సమస్యల పరిష్కారం : మంత్రి జూపల్లి

పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని, ప్రజాప్రతినిధులకు నిధులు, విధులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం పాలమూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ ఎన్నికలో నామినేషన్‌లు ఉపసంహరించుకున్న అభ్యర్థులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమస్యలు కాంగ్రెస్‌తోనే పరిష్కారం అవుతాయని, సీఎం రేవంత్‌రెడ్డిపై నమ్మకంతో ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీలో నిలబడ్డ 10 మంది అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకుని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా నిలవడం అభినందనీయమన్నారు. వెంటనే వీరిని సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి స్థానిక సమస్యలపై చర్చించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని, ఎంపీ ఎన్నికల్లోనూ జిల్లాలోని రెండు స్థానాలను కైవసం చేసుకుంటామన్నారు. బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కులేదన్నారు. పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని చెప్పినా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇక బీఆర్ఎస్‌కు రాష్ట్రంలో ఒక్కసీటు రాదని, ఆ పార్టీ కనుమరుగవుతుందన్నారు. పోటీ నుంచి తప్పుకున్న అభ్యర్థులు మాట్లాడుతూ స్థానిక సంస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని, విధులు, నిధులు ఇవ్వాలని ఎప్పటినుంచో అడుగుతున్నా బీఆర్ఎస్ పట్టించుకోలేదన్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యేలపై నమ్మకం ఉన్నందునే తాము పోటీనుంచి తప్పుకుని కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లికృష్ణారావు



పరీక్ష పూర్తైన తరువాత ఇళ్లకు వెళ్లేముందు బాధతో ఉన్న విద్యార్థినులు

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- చివరి రోజు 232 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఐఈవో

మహబూబ్‌నగర్, (విద్యావిభాగం) మార్చి 14: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు 33 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు రెండో సంవత్సరం విద్యార్థులు మొత్తం 9,322 మందికిగానూ 9,090 మంది హాజరయ్యారు. 232 మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో 7,718 మంది జనరల్ విద్యార్థులు, 1,372 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. పరీక్షలు పూర్తయిన అనంతరం విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వస్తున్న సమయంలో కొంత బాధతో కనిపించారు. ఎందుకంటే పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఏవరి గ్రామాలకు వారు వెళ్లడం. రెండేళ్లుగా కలిసి ఉన్న స్నేహితులు విడిపోతున్నట్లుగా బాధపడ్డారు. డీఐఈవో అధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినందుకు చీఫ్ సూపరింటెండెంట్లకు, అడిషనల్ సీఎస్, డిపార్ట్‌మెంట్ అధికారులకు, కస్టోడియన్, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలకు ఆయన అభినందనలు తెలిపారు.

● నాగర్‌కర్నూల్ టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగియగా గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు పూర్తయ్యాయి. చివరి రోజు నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 32 కేంద్రాల్లో 6129 మంది విద్యార్థులకుగాను 5861 మంది హాజరు కాగా 268 మంది గైర్హాజరయ్యారు. అందులో జనరల్ విద్యార్థులు 4922 మంది హాజరు కాగా 211 హాజరు కాలేదు. అదేవిధంగా ఒకేషనల్‌లో 939 మంది హాజరు కాగా 57 మంది గైర్హాజరు అయ్యారు. గత నెల 28న ప్రారంభమైన ఇంటర్ పరీక్షల్లో చివరి రోజు వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



పరీక్షలు పూర్తవడంతో గ్రామాలకు వెళ్తున్న విద్యార్థినులు

పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం

- అభివృద్ధి అనేది ఒక్కరు చేసేది కాదు
- హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు పూర్వవైభవం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, మార్చి 14: నియోజకవర్గంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు ఒక్కొక్కటిగా పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ఏ ఒక్కరో చేస్తే ఆగిపోయేది అభివృద్ధి కాదన్నారు. ప్రభుత్వం మారడంతో మిగిలిన పనులు ఏమవుతాయోననే అభద్రత భావం ప్రజల్లో నెలకొందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నాటి అసంపూర్తి పనులను పూర్తి చేయడమే కాకుండా అదనంగా గద్వాల-డోర్నకల్ రైల్వేలైన్ పనులు, నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ కేంద్ర ఏర్పాటు, ఫారెస్ట్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. జిల్లా కేంద్రానికి మంజూరైన మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల పనులు కేవలం 50 శాతం మాత్రమే పూర్తయ్యాయని, వాటిని పూర్తి చేయడమే కాకుండా పట్టణంలో నిర్మించిన టౌన్ హాల్‌లో మౌలిక వసతులు కల్పించడానికి రూ. 3.50 కోట్లు అవసరమని, వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణం, పెబ్బేరులో ఫిషరీస్ కళాశాలలో పీజీ కళాశాల ఇంటర్ నేషనల్ తరహాలో తీర్చిదిద్దుతామన్నారు. అదే విధంగా పెబ్బేరులో ఫుట్‌బాల్ స్టేడియాన్ని ఏర్పాటు చేస్తామని, బుద్దారం, ఘణపురం చెరువులను నింపి రైతులకు పంట నష్టం జరగకుండా చూస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అడ్డగోలుగా మొదలు పెట్టిన రోడ్ల విస్తరణ పెండింగ్ పనులు కూడా అందరి సహకారంతో పూర్తి చేయిస్తామన్నారు.

వనపర్తికి తలమానికం లాంటి పాలిటెక్నిక్ కళాశాల భవనానికి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. గతంలో ఉన్న పాత భవనాల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిన హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు రేవంత్‌రెడ్డి సారథ్యంలో పూర్వవైభవం తీసుకొచ్చి ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునేలా నిరుపేదలకు సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, నాయకులు ఖమ్మర్ మియా, బీ కృష్ణ, కిరణ్‌కుమార్, నంది మల్ల యాదయ్య, రాగివేణు, అనీస్, ఎండీ బాబా, సమ్మద్ మియా, వెంకట్‌నారాయణ, వేణాచారి, పెంటన్న, సేవాదళ్ జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

సేవచేసే అవకాశం ఇవ్వండి

- ఉమ్మడి పాలమూరులో రెండు ఎంపీ సీట్లను గెలిపించి మోదీకి బహుమతిగా ఇవ్వాలి
- పాలమూరు అభివృద్ధికి కృషి చేస్తా : డీకే అరుణ

మహబూబ్‌నగర్(క్లాక్‌టవర్), మార్చి 14 : పాలమూరు ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించాలని బీజేపీ అభ్యర్థి డీకే అరుణ కోరారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ ప్రకటించిన 2వ జాబితాలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా తనను ఎంపికచేశారని, ఇందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. ఇంతకు ముందు పాలమూరు నుంచి పార్లమెంట్‌కు వెళ్లిన ఎంతో మంది పాలమూరు ప్రజలకు సేవ చేయకుండా ఢిల్లీలో కూర్చున్నారని ఆరోపించారు. తనను పార్లమెంట్ సభ్యురాలిగా భారీమెజార్టీతో గెలిపించి జిల్లా అభివృద్ధికి, పాలమూరు ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలపై పోరాడిన బీజేపీ కార్యకర్తలు, నాయకులు జైలు పాలయ్యారన్నారు.

కేసీఆర్ అవినీతి అక్రమాలను బయటపెట్టింది బీజేపీ నాయకులు, కార్యకర్తలే అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న, చేసిన పథకాలను వివరించారు. నరేంద్ర మోదీ హామీ ఇస్తే అమలు చేసి తీరుతాడన్నారు. ముచ్చటగా మూడోసారీ దేశ ప్రధానిగా నరేంద్రమోదీ కావడం ఖాయమన్నారు. ఈ విషయంపై యువత మొదలుకొని వృద్ధుల వరకు గ్రామాల్లో చర్చ జరుగుతోందని అన్నారు. ఉమ్మడి పాలమూరు అభివృద్ధి జరగాలంటే రెండు ఎంపీ సీట్లు గెలిపిం చాలని ఆమె కోరారు. అనంతరం కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలలో విజయం సాధించేందుకు పాటించాల్సి న పలు అంశాలపై చర్చించారు.

అదేవిధంగా వివిధ మండలాల అధ్యక్షులను ఎంపిక చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, పడాకుల బాలరాజు, జయశ్రీ, రాష్ట్ర నాయకులు ఏపీ మిథున్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీ శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ డోకూరు పవన్ కుమార్ రెడ్డి, కోశాధికారి పాండురంగారెడ్డి, ఉపాధ్యక్షుడు క్రిష్ణవర్ధన్‌రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రాజేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చ ప్రవీణ్ యాదవ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మవేణి తదితరులు ఉన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయారు

- మాకు పదేళ్లలో చెడ్డపేరు వస్తే మీకు మూణ్నెళ్లలోనే వచ్చింది : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- రైతుబంధు రూ.16వేలు దేవుడెరుగు ఉన్నది కూడా ఇస్తలేరు : ఎమ్మెల్సీ చల్లా
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం : ఎమ్మెల్యే బండ్ల

అలంపూర్ చౌరస్తా/గద్వాల న్యూటౌన్, మార్చి 14: కాంగ్రెస్ చెప్పిన మాయ మాటలకు ఓటేసి మోసపోయామని మూడు నెలల్లోనే ప్రజలు గ్రహించారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం అలంపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్ కుమార్‌రెడ్డి, గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఇటీవ ల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయమని గ్రహించారని అన్నారు. ఏ పార్టీకి లేని వ్యతిరేకత మూడు నెలల్లోనే కాంగ్రెస్‌పార్టీ మూటగట్టుకుందని అన్నారు. ఇప్ప టికే వేలాదిమంది రైతులు తనకు ఫోన్ చేసి బీఆర్ఎస్‌ను ఓడించి తప్పు చేశామని బాధపడు తున్నారని అన్నారు. 12మంది ఎమ్మెల్యేల ఓట మికి ఒక్క ఎమ్మెల్సీని గెలిపించుకొని కాంగ్రెస్‌కు బుద్ధిచెబుదామని అన్నారు. ఎన్నికలకు ముందు రైతుబంధు రూ.16వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ ఇస్తున్న రైతుబంధును కూడా బంద్ చేసిందని, ఇక ఆ పార్టీని నమ్మేదెవరని ఎమ్మెల్సీ చల్లా అన్నారు. అనంతరం గద్వాల పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలలో గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రలోభాలకు లొంగకుండా బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని, గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జడ్పీ వైస్‌ఛైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. ప్రజాప్రతినిధుల సమస్యలపై చట్టసభలలో మాట్లాడటానికి తనకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గద్వాల మునిసిపల్ ఛైర్మన్ బీఎస్ కేశవ్, గ్రందాలయ మాజీ ఛైర్మన్ రామన్‌గౌడ, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, అలంపూర్ ప్రజాప్రతినిధులు చిన్నదేవన్న, మనోరమ, కరుణశ్రీ, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పాడి రైతుల పరేషాన్

- రెండు నెలలుగా అందని బిల్లులు
- వారం రోజుల్లో చెల్లించకపోతే ధర్నా చేస్తామంటున్నరైతులు



సమావేశమైన పాడి రైతులు

కల్వకుర్తి, మార్చి 14 : విజయ పాడి రైతులు బిల్లులు రాక పరేషాన్ అవుతున్నారు. వ్యవసాయ రంగానికి అనుసంధానంగా ఉన్న పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తామని పాలకులు ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచు కోవడం లేదు. దీంతో పాడి పరిశ్రమపై ఆధారపడ్డ అన్నదాతలు అప్పులపాలు కావాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. కల్వకుర్తి పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో ఏడు బీఎంసీలు ఉన్నాయి. రైతులు కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రంతో పాటు బీఎంసీల్లో పాలు విక్రయిస్తుంటారు.

పాడి రైతులకు ప్రతి 15 రోజులకొకసారి బిల్లులు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిగేవి. గత రెండు నెలలుగా పాల బిల్లులు రాకపోవడంతో పాడి రైతులు పెండింగ్ బిల్లులు ఎప్పుడు ఇస్తారంటూ ఎదురు చూస్తున్నారు. విజయ డెయిరీ ఎండీని, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిలను కలిసి పాల బిల్లు రెగ్యులర్‌గా చెల్లించాలని వినతి పత్రాలు సైతం సమర్పించారు. అయినా విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న విజయ పాల బిల్లులను వారం రోజుల్లోపు చెల్లించకపోతే జాతీయ రహదారిపై పాడి పశువులు, పాల క్యాన్లతో ధర్నా చేపడుతామని పాల శీతలీకరణ కేంద్రం కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, కుడుముల శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు విలేకరులతో అన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. పాడి పశువులకు దాణా, కాల్షియం, మినరల్ మిక్చర్, మందులను అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులతో పాటు 4 రూపాయల ప్రోత్సాహన్ని విడుదల చేయాలని కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, కుడుముల శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, వీరయ్య, బి.వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పేర్కొన్నారు.

సారొళ్లు సమయానికి వస్తరా..?

- నేటి నుంచి ఒంటిపూట బడులు
- స్థానికంగా ఉండని ఉపాధ్యాయులు
- ప్రశ్నార్థకమవుతున్న విద్యాభ్యాసం

అచ్చంపేట రూరల్, మార్చి 14 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని ఏజెన్సీప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సమయానికి వస్తారా.. అనే ప్రశ్న స్థానికుల్లో మొదలైంది. నేటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమవుతండడంతో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒంటిపూట బడులు ప్రారంభమైతే ఉదయం ఎనిమిది గంటలకే ప్రార్థన చేయించాలి. మధ్యాహ్నం 12:30 గంటలకు బడి వదలాలి. కానీ ఏజెన్సీ ప్రాంత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు చాలా మంది స్థానికంగా ఉండకపోవడడంతో ప్రతీరోజు అచ్చంపేట, దేవరకొండ నుంచి వస్తుంటారు. సారొళ్లు వస్తేగాని పాఠశాలల తలుపులు తెరుకోలేని పరిస్థితి ఉంటుంది. మామూలుగా రెండు పూటల బడి ఉన్న సయంలోనే పాఠశాలలకు ఉదయం 10 నుంచి 10:30 గంటలకు వచ్చేవారు. ఇప్పుడు ఎనిమిది గంటలకు పాఠశాలకు వస్తారా.. ఒకవేళ ఉపాధ్యాయులు ఎప్పటిలాగే 10:30 గంటలకు వస్తే తరగతులు ఎలా నిర్వహిస్తారని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్థానికంగా ఉండేందుకు ప్రభుత్వం వీరికి ఏజెన్సీ అలవెన్సుతో పాటు హెచ్‌ఆర్‌ఏ ఇస్తోంది. అయినా కొంతమంది ఉపాధ్యాయులు అచ్చంపేట, దేవరకొండ ప్రాంతాల్లో ఉంటూ పాఠశాల సమయానికి రావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.



ఉపాధ్యాయులు రాకపోవడంతో బక్కలింగాయపల్లి పాఠశాల ముందు ఎదురు చూస్తున్న విద్యార్థులు (ఫైల్)

స్థానికంగా ఉండాలి

ఏజెన్సీ ప్రాంతాలకు రవాణా సౌకర్యం తక్కువగా ఉంటుంది. కాబట్టి ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, ఉద్యోగులు స్థానికంగా ఉంటేనే విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. పట్టణాలలో ఉంటూ మా ప్రాంతానికి సమయానికి రాలేకపోతున్నారు. దీంతో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు సమయం సరిపోదు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులు స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- రాఘవులు, సిద్ధాపూర్ గ్రామం



సిద్ధాపూర్ వరకు ప్రత్యేక బస్సును నడుపుతాం

విద్యార్థులకు ఒంటిపూట బడులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అచ్చంపేట నుంచి సిద్దాపూర్ వరకు ఉదయం 6:30గంటలకు ప్రత్యేక బస్సును నడపడానికి సంస్థ నిర్ణయించింది. ఈ బస్సు ఉదయం 6:30గంటలకు అచ్చంపేట నుంచి బయల్దేరి చివరి స్టేజీ సిద్దాపూర్‌కు ఉదయం 7:30 గంటలకు చేరుకుంటుంది.

- పీఎస్ దేవి, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్, అచ్చంపేట





జాతరలో సిడె కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీగా వచ్చిన భక్తులు

భక్తిశ్రద్ధలతో గంగ మంత్రాలమ్మ సిడె

కోడేరు, మార్చి 14: మండలంలోని జనుంపల్లి శివారులో వెలసిన గంగ మంత్రాలమ్మ సిడె గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సిడెలో మొదలు దేవత రథానికి ఒక పెద్ద కర్రను కట్టి దాని చివరన పూజారి పలగొర్ల రాములును వేలాడదీసి గుడి చుట్టూ రథాన్ని తిప్పారు. రథం వెనక బోనాలు, కోళ్లు, మేకలు, పొట్టేళ్లు, కొబ్బరికాయలతో ప్రదక్షిణలు చేసి అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇసుక తరలిస్తున్న పలువురిపై కేసు నమోదు

-ట్రాక్టర్ సీజ్ చేసిన పోలీసులు

అచ్చంపేటరూరల్, మార్చి 14 : అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఇద్దరిపై గురు వారం కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సిద్ధాపూర్ ఎస్ఐ బి.పవన్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని ఐనోల్ క్రాస్ రోడ్డులో గురువారం ఉదయం 6గంటలకు ట్రాక్టర్ ద్వారా అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ గొడుగు మహేష్, ట్రాక్టర్ యాజమాని ఘణపూర్ గ్రామస్థుడైన లింగంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

● తెలకపల్లి : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. తెలకపల్లి బ్రిడ్జి స్కూల్ వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని బ్లూకోర్ట్ స్టాఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ దాని డ్రైవర్ అయిన ఎత్తప మల్లేష్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

కల్వకుర్తి : అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేయడం జరిగిందని, కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధిం చిన వివరాలు ఎస్ఐ కథనం ప్రకారం.. కల్వకుర్తి పట్టణంలోని గ్రీన్ పార్కు వెంచర్ దగ్గర ఎలాంటి అనుమతులు లేకుండా ఉన్న ఇసుక టిప్పర్‌ను గుర్తిం చడం జరిగింది. టిప్పర్‌ను స్టేష న్‌కు తరలించి డ్రైవర్, ఓనరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

క్రిప్టోకరెన్సీపై అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

జడ్చర్ల, మార్చి 14 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రిప్టో కరెన్సీపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం కళాశాలలోని సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో రిసోర్స్‌పర్సన్‌గా ఐసీఎఫ్ఏఐ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేందర్ మిరియాల, నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, హైదరాబాద్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయికిరణ్‌లు క్రిప్టోకరెన్సీపై వివరించారు. క్రిప్టోకరెన్సీ అంశంపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అకడమిక్ కోఆర్డినేటర్ రవీందర్‌రావు, కామర్స్ లెక్చరర్లు మంజుల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన ట్యాక్స్

» తాళాలు వేసిన మునిసిపల్ సిబ్బంది



ఆస్తిపన్ను చెల్లించని షాపులకు తాళాలు వేస్తున్న మునిసిపల్ కమిషనర్ వి.శ్యాంసుందర్, మునిసిపల్ సిబ్బంది

అచ్చంపేట రూరల్, మార్చి 14 : భారీగా పేరుకుపోయిన ఆస్తి పన్నులను వెంటనే చెల్లించకపోతే తాళాలు వేయడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ వి.శ్యాంసుందర్ అన్నారు. గురువారం అచ్చంపేట మండలంలోని మండల పరిషత్‌వ్యాపార దుకాణాల సముదాయాలల్లో ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు ఉన్న వారి దుకాణాలకు తాళాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 జూన్‌లోనే భారీగా పేరుకుపోయిన ఆస్తి పన్నుదారులకు నోటీసులు ఇచ్చామని, అయినా ఇంతవరకు ఎలాంటి స్పందన రాలేదన్నారు. గత పదిరోజుల క్రితం నోటీసులు ఇచ్చి అనంతరం గత రెండు మూడు రోజులుగా సంబంధిత వాణిజ్య దుకాణాదారులకు భవన నిర్మాణ యాజమానులకు మౌఖికంగా చెప్తున్నా గాని ఇంత వరకు ట్యాక్స్ కట్టని వారి వ్యాపార సముదాయాలను సీజ్ చేయడం జరిగిందని అన్నారు. మునిసిపల్ శాఖ ఆస్తి పన్నుపై అధిక మొత్తంలో ఫెనాల్టి పైన 90శాతం మినహాయింపు ఇస్తున్నందున అందరూ ఉపయోగించుకుని పేరుకుపోయిన తమ ఆస్తి పనులను 90శాతం మినహాయింపులతో సకాలంలో చెల్లించి లబ్ధి పొందాలన్నారు. అలాగే నగర అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి గురైన వాహనం గుర్తింపు

» పోలీసులను గుర్తించి పరారైన నిందితుడు



చోరీకి గురైన వాహనం

గద్వాల క్రైం, మార్చి 14 : ఇటీవల చోరీకి గురైన వాహనాన్ని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విద్యుత్ శాఖ ఉప కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించే నాగరాజు ఈ నెల 11న ఉదయం విధులకు వెళ్లి, సాయంత్రం ఆరు గంటలకు పట్టణంలోని నది అగ్రహారం రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం ముందున్న షెడ్‌లో బొలెరో వాహనాన్ని నిలిపి ఇంటికి వెళ్లారు. 12వ తేదీ ఉదయం చూడగా వాహనం మాయమైంది. దానితో పాటు, అందులోని విద్యుత్‌శాఖకు సంబంధించిన రూ.50వేల విలువైన సామగ్రి కూడా చోరీకి గురైనట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని, ఎస్పీ రితిరాజ్ ఆదేశం మేరకు డీఎస్పీ సత్యనారాయణ సూచనతో విచారణ చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా, నిందితుడు బొలేరో వాహనాన్ని రాయిచూర్ రూట్‌లో తీసుకెళ్లినట్లు గుర్తించారు. జడ్చర్ల, షాద్‌నగర్‌ల మీదుగా హైదరాబాద్ నగరాన్ని దాటి నాగపూర్ రూట్‌లో వెళ్తున్నట్లు గుర్తించి ఫోలో చేశారు. చివరకు వాహనం నిర్మల్ జిల్లా ఇందల్‌వాయి టోల్ ప్లాజాను దాటినట్లు గుర్తించి, సంబంధిత పోలీసులను అప్రమత్తంగా చేశారు. వారు వెంబడించడంతో పోలీసులను గమనించిన నిందితుడు, వాహనాన్ని వదిలిపెట్టి పరారయ్యాడు. అనంతరం గద్వాల పోలీసులు అక్కడికి చేరుకొని వాహనంతో పాటు విద్యుత్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పరారైన నిందితుడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బల్మూరు, మార్చి 14 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని కొండనాగుల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొండనాగుల విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్న బాల్య తన విధులు ముగించుకుని అచ్చంపేట వైపు తన స్కూటీపై వెళ్తుండగా మార్గ మధ్యలోని దొంతికుంట వద్ద లింగాల వైపు వెళ్తున్న ఇండికా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాల్య ఎడమ కాలు, కుడి చేయి విరిగిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు డాక్టర్లు రిఫర్ చేశారు. ఈ సంఘటనపై బాధితుని బావ కుర్ర హనుమంతు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ నజీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

అదనపు భత్యం జాడేది?

» ఉపాధి కూలీలకు మూడేళ్లుగా అందని అదనపు భత్యం
» కొత్త సాఫ్ట్‌వేర్‌లో తొలగించిన అదనపు భత్యం కాలం
» అసంతృప్తికి గురవుతున్న కూలీలు



వనపర్తి మండలం అంకూరు గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కూలీలు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 14 : గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచి వలసలు నివారించేందుకు 2005 ఆగస్టు 25న అప్పటి కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని ప్రవేశపెట్టింది. చట్టబద్ధమైన కనీస వేతనంతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్న గ్రామీణులకు ఉపాధి కల్పించడం ఈ చట్టం ఉద్దేశం. నాటినుంచి గ్రామాల్లో పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న చాలా మంది ఈ పథకం ద్వారా కొంతో గొప్పో లబ్ధి పొందుతున్నారు. ప్రతీఏటా నిర్దేశిత కనీస వేతనంతో పాటు, వేసవిలో అదనపు భత్యం కూడా ఇచ్చేవారు. కానీ గత మూడేళ్లుగా కూలీలకు ఇవ్వాల్సిన వేసవి భత్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో కూలీలు నిరాశకు గురవుతున్నారు. రోజువారి కూలీతో పాటు, అదనపు భత్యం కూడా చెల్లిస్తే తమకు మరింత ప్రోత్సాహకంగా ఉంటుందని చెబుతున్నారు.

మూడేళ్ల క్రితమే అదనపు భత్యం నిలిపివేత

గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి నూతన సాఫ్ట్‌వేర్ రూపొందించే క్రమంలో మూడేళ్ల క్రితం అంటే 2022లో కూలీలకు అదనపు భత్యానికి సంబంధించిన ఆప్షన్ తొలగించారు. అప్పటి నుంచి వేసవిలో ఇచ్చే అదనపు భత్యం నిలిచిపోయింది. వేసవిలో ఎండల తీవ్రత పెరగడం, వాతావరణ పరిస్థితులు కఠినంగా మారడం వంటి పరిస్థితుల్లో ఉపాధి పనులు చేసే కూలీలకు ప్రోత్సాహకంగా రోజువారి కూలీతో పాటు అదనపు భత్యం కూడా ఇచ్చేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్ నెలలో 20 శాతం అదనంగా చెల్లించేవారు. ప్రస్తుతం ఎండలు తీవ్రతరం కావడం, అదనపు భత్యం లేకపోవడం ఉపాధి కూలీలను తీవ్ర నిరాశకు గురి చేస్తున్నది. గత మూడేళ్ల పాటు అదనపు భత్యం ఇవ్వలేదు. ఈ ఏడాది కూడా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. దీంతో ఉపాధి కూలీలు, అదనపు భత్యం రద్దు అయినట్లేనని భావిస్తున్నారు. ఎన్ఆర్ ఈజీఎస్‌కు గతంలో రాష్ట్ర ప్రభుత్వం సాఫ్ట్‌వేర్ రాగాస్ ఉండేది. మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఒకే సాఫ్ట్‌వేర్ ఉండేలా నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. అప్పుడే అదనపు భత్యానికి సంబంధించిన కాలమ్‌ను పొందుపరచలేదు.

రెండు లక్షల 72వేల మంది కూలీలు

జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు, 44 బ్లాకులు ఉన్నాయి. కాగా ఒక లక్షా 34వేల జాబ్‌కార్డులు, రెండు లక్షల 72వేల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరంతా నిత్యం ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమై గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి రోజువారి కూలి గరిష్టంగా రూ.272 గా ప్రభుత్వం నిర్ణయించింది. కానీ రూ.180 మించి కూలి పడట్లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. దీనికితోడు ప్రభుత్వం ఇదివరకు లాగే అదనపు భత్యం కూడా ఇస్తే మరింత ఎక్కువ మొత్తంలో కూలి పడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇదిలా ఉంటే పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు తాగు నీటి సదుపాయం, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, ప్రథమ చికిత్స కోసం ఏర్పాట్లు, కేర్ టేకర్ వంటి సదుపాయాలను కల్పించాలి. అక్కడక్కడా ఇప్పుడిప్పుడే ఈ సదుపాయాలన్ని ప్రారంభిస్తున్నప్పటికీ ఇంకా చాలాచోట్ల ఏర్పాటు కాలేదు. తక్షణమే ఏర్పాట్లు చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

అదనపు భత్యంపై సమాచారం లేదు

మూడేళ్ల క్రితం వరకు ఉపాధి కూలీలకు అదనపు భత్యం అందేది. ఈ ఏడాది అదనపు భత్యంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఏమైనా ఆదేశాలు వస్తే తప్పక పాటిస్తాం. ఉపాధి కూలీలకు మాత్రం రోజువారీగా ప్రభుత్వం రూ.272 వరకు చెల్లిస్తుంది.

- ఉమాదేవి, డీఆర్‌డీవో, వనపర్తి జిల్లా

మోదీకి తెలంగాణలో అడుగు పెట్టే హక్కు లేదు

» ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ వ్యాఖ్యలు



కొల్లాపూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

కొల్లాపూర్, మార్చి 14 : కేంద్రంలో పది సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఏ ఒక్క సంక్షేమం అభివృద్ధి చేయని వారు ఎలా ఈ గడ్డపై అడుగు పెడుతారో బీజేపీ నా యకులు చెప్పాలని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీకి అడుగు పెట్టే నైతిక హక్కు లేదని ఆయన ధ్వజమెత్తారు. రేవంతన్నకు దండుగా ప్రజాపాలనకు అండగా కార్యక్రమంలో భాగంగా గురువారం కొల్లాపూర్ మండల పరిధిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సంపత్‌కుమార్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వచ్చే పార్ల మెంట్ ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆదరించి ఆశీర్వదించాలని ప్రజలను కోరుతూ రేవంత్‌రెడ్డికి నైతిక ధైర్యం కల్పించేందుకు రేవంతన్నకు దండుగా ప్రజాపాలనకు అండగా కార్యక్రమాన్ని చేపట్టానన్నారు. ప్రతి నియోజకవర్గంలో తిరుగుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో పర్యటించడం జరిగిందన్నారు. లక్ష్మీ నరసింహ స్వామి ఆశీర్వాదం తీసుకున్నామని తెలిపారు. నాగర్‌కర్నూల్ ఎంపీ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానానికి 26మంది దరఖాస్తు చేసుకున్నారని, టికెట్ ఎవరికీ ఇవ్వాలన్నది స్క్రీనింగ్ కమిటీ, ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ, సెంట్రల్ ఎలక్షన్ కమిటీ నిర్ణయిస్తుందన్నారు. ఆ ప్రక్రియ కొనసాగుతున్నదని, ఈ నెల 18న ఢిల్లీ కేంద్రంగా ఎంపీ అభ్యర్థి ప్రకటన ఉంటుందన్నారు. అనంతరం కొల్లా పూర్ పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే, బాబు జగ్జీవన్‌రావు, డాక్టర్ బీఆర్. అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. పట్టణంలో ఖాదర్‌బాషా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎండి.ఎక్బాల్, సింగిల్ విండో డైరెక్టర్‌పస్పుల నరసింహ, శేఖర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రఘుపతిరావు, సింగోటం మాజీ సర్పంచ్ వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు కొమ్ము వెంకటస్వామి, కేతూరి దర్మతేజ, కృష్ణమనాయుడు, ఖాదర్‌బాష, భీంశెట్టి దిలీప్, బచ్చలకూర బాలరాజు, రెడ్డిసత్యం, వెంకటయ్య, బాలరాజు, ఖాద్రి పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన

- రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్



విద్యార్థులకు పరీక్షల ప్యాడులను అందిస్తున్న లయన్ నటరాజ్

భూత్పూర్, మార్చి 14 : విద్యతోనే పేదరిక నిర్మూలన జరుగుతుందని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్ అన్నారు. మండలంలోని కర్వెన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లను అందించారు. ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుంటున్నారని, విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలంటే పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. వచ్చే పదో తరగతి పరీక్షల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మంచి ర్యాంకులు సాధించాలని విద్యార్థులను కోరారు. అదే విధంగా మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ శివారులో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులకు దేవరకద్ర మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రాములు తన సొంత ఖర్చులతో పదో తగతి విద్యార్థులకు ప్యాడులను అందించారు. ఈ కార్యక్రమంలో కర్వెన పాఠశాల ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు సాయినాథ్, రఘురాం, స్వప్నలత, వెంకటేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపీనాథ్, చంద్రమౌళి, ప్రవీణ్‌కుమార్, జ్యోతిబా పాఠశాల ఎస్‌వో బస్వరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్డింగ్ చేస్తుండగా పేలిన ఆయిల్ ట్యాంకర్



పేలిన ట్యాంకర్

భూత్పూర్, మార్చి 14 : వెల్డింగ్ చేస్తుండగా ఖాళీ ఆయిల్ ట్యాంకర్ పేలి ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన వాహనం (లారీ) ఆయిల్ లోడ్‌తో తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా భూత్పూర్ దగ్గర ఖాళీ అయిల్ ట్యాంకర్‌ను వెనుక భాగంలో వెల్డింగ్‌తో మరమ్మతు చేయిస్తుండగా ప్రమాదవశాత్తు ట్యాంకర్ పేలింది. ఈ సంఘటనలో ట్యాంకర్ డ్రైవర్ నారాయణకు తీవ్రగాయాలు అయ్యాయి. అదే విధంగా వెల్డింగ్ షాపు పక్కనే ఉన్న పంక్చర్ దుకాణంలో పని చేస్తున్న భూత్పూర్ పట్టణానికి చెందిన అజ్వల్ అనే వ్యక్తికి గాయాలయ్యాయ్యి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన ఇటిక్యాల గురుకుల విద్యార్థులు

ఇటిక్యాల, మార్చి 14 : జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు బ్యాడ్మింటన్, సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ తిరుపతయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల ఎనిమిదిన హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో విద్యార్థి ప్రణీత్ రాణించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. సెపక్‌తక్రా విభాగంలో నిఖిల్, విష్ణు జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 10 నుంచి 14 వరకు బీహార్‌లోని పాట్నాలో అరవిందో జూనియర్ నేషనల్ పోటీల్లో వారు పాల్గొనున్నట్లు తెలిపారు. వారిని జిల్లా అధికారి రఘు, కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్‌రాణి అభినందించారు.

ఖాతాల్లోకి 'రైతు భరోసా'

» జిల్లాలో 2,39,123 మంది అన్నదాతలు » మంజూరైన నిధులు రూ.231.07 కోట్లు
» బ్యాంకులో నమోదు చేసుకున్న రైతులు 2,20,051
» ఇప్పటివరకు 1,84,745 మంది ఖాతాల్లో రూ.122.14కోట్లు జమ



దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

పాలమూరు, మార్చి 14 : మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు భరోసా అమలు కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల కోసం నెల న్నర క్రితం పథకాన్ని ప్రారంభించగా ప్రతిరోజూ కొంతమంది రైతుల ఖాతాల్లో రైతుభరోసా (రైతుబంధు)ను జమ చేస్తున్నారు. జిల్లాలో సుమారు నాలుగు ఎకరాలలోపు ఉన్న రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు నిధులు జమ చేసి నట్లు అధికారులు తెలిపారు. మార్చి 20వ తేదీ నాటికి పూర్తిగా రైతులందరి ఖాతాల్లో డబ్బు జమ అవుతుందని జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పేరిట రైతులకు సహకారం అందిస్తోంది. ఎకరాకు రూ.ఐదువేల చొప్పున రైతుల ఖాతాల్లో ట్రెజరీ ద్వారా డబ్బులను జమ చేస్తున్నారు. జిల్లాలో మొదట ఎకరంలోపు ఉన్న రైతుల ఖాతాల్లో రైతు భరోసాను జమ చేశారు. ఎకరం పూర్తయిన అనంతరం రెండెకరాల రైతుల ఖాతాల్లో డబ్బును వేశారు. ప్రభుత్వం ఒక్కో ఎకరం పెంచుకుంటూ ఈ డబ్బులను జమ చేస్తున్నారు.

పాత విధానంలోనే..

డిసెంబరులో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారికి పాత విధానంలోనే రైతుబంధు, రైతు భరోసా నిధులను రైతులకు అందిస్తోంది. ఎకరాకు రూ.15వేల చొప్పున ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మార్చి 12వ తేదీ నాటికి మహబూబ్‌నగర్ జిల్లాలో 2,39,123 మంది రైతులను అర్హులుగా అధికారులు గుర్తించారు. దానికోసం రూ.231.07 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వానా కాలం సీజన్‌లో 2,17,267 మంది రైతుల ఖాతాల్లో గత ప్రభుత్వం రూ.221.43 కోట్లు జమ చేసింది. యాసంగి సీజన్‌కు జిల్లాలో 2,39,123మంది రైతు భరోసాకు అర్హులుగా గుర్తించి వారికి రూ.231.07 కోట్లు కేటాయించారు. అర్హులుగా గుర్తించిన వారిలో మొదట ఎకరాలోపు రైతుల నుంచి మొదలుపెట్టి, తరువాత మిగిలిన వారి ఖాతాల్లో నగదు వేయను న్నట్లు అధికారులు తెలిపారు. నేటికీ బ్యాంకులో నమోదు చేసుకున్న రైతులు 2,20,051 ఖాతాల్లో రూ.122.14 కోట్ల డబ్బు జమ చేశారు.

అర్హులందరి ఖాతాల్లో జమ

అర్హులైన రైతులందరి ఖాతాల్లో ప్రభుత్వం రైతు భరోసా డబ్బు జమ చేస్తోంది. మొదట ఎకరంలోపు భూమి ఉన్న రైతులకు, అనంతరం మిగిలిన రైతులకు వరుసగా ఖాతాల్లో డబ్బు జమ చేస్తారు. రైతులు భయపడాల్సిన అవసరం లేదు. అర్హులైన వారందరికి పెట్టుబడి సహాయం అందుతుంది.

- బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి

పట్ట పగలే రూ.5 లక్షలు చోరీ

అలంపూరు, మార్చి 14 : చిన్న ఏమరుపాటు కొంప ముంచింది. బైక్ ముందుండే బ్యాగ్‌లో డబ్బు ఉంచి, ఓ పది అడుగులు కూరగాయలు కొనేలోపే ఆ డబ్బు మాయమయ్యింది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరు పట్టణంలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనపై సీఐ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అలంపూరు మండలం గొందిమళ్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గురువారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు వెళ్లాడు. తన ఖాతా నుంచి ఐదు లక్షల రూపాయలు డ్రా చేశారు. డబ్బు తీసుకొని బ్యాంకు నుంచి బయటికి వచ్చి, తన బైక్ ముందుండే బ్యాగ్‌లో డబ్బు పెట్టాడు. ఆ తర్వాత రోడ్డు పక్కనున్న కొట్టులో కూరగాయలు కొనేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసుకుంటే బైక్‌లోని బ్యాగ్‌లో డబ్బు మాయమైంది. దీంతో అతడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయాన్ని తెలిపారు. పోలీసులు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బ్యాంకు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

మక్తల్, మార్చి 14 : ట్రాక్టర్ బోల్తా పడి ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాచ్‌వార్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలి ఉన్నాయి. కాచ్‌వార్ గ్రామానికి చెందిన బొడ్రా యి మోహన్‌గౌడ్ (41) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. గురువారం మక్తల్‌కు వెళ్లి ట్రాక్టర్‌ను రిపేరు చేయించుకొని వచ్చాడు. అనంతరం వ్యవసాయ పొలానికి వెళుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ క్రమంలో మోహన్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈసంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి..



గణేష్ (ఫైల్)

వెల్దండ, మార్చి 14 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుప్పగండ్ల గ్రామానికి చెందిన దాసరి గణేష్ (25) అనే యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ... గణేష్ ద్విచక్ర వాహనంపై పెద్దాపూర్ నుంచి కుప్పగండ్లకు వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా జరిగిన సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మరో యువకుడు..

మిడ్జిల్, మార్చి 14 : మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామానికి చెందిన పబ్బతి ఆంజనేయులు (18) జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఆంజనేయులు పురుగుల మందు తాగాడని, విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని తెలిపారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున ఆంజనేయులు మృతి చెందినట్లు తెలిపారు.

చెరువులో మునిగి..



వెంకటేష్ (ఫైల్)

ఖిల్లాఘణపురం, మార్చి 14 : చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం కమలోద్దిన్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సింగనమోని వెంకటేష్(38) గురువారం సాయంత్రం గ్రామ శివారులోని నాగసముద్రం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. చెరువులోకి దిగి చేపలు పట్టుకోవడానికి వేసిన వలలో కాలు చిక్కుకొని నీటిలో మునిగిపోయాడు. చెరువులోకి దిగిన వ్యక్తి పైకి రాకపోవడంతో గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. మృతుడికి భార్య రమాదేవి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై ఎస్సై శ్రీహరిని వివరణ కోరగా వ్యక్తి చెరువులో మునిగి చనిపోయినట్లు సమాచారం ఉందని, కుటుంబ సభ్యులెవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారని అన్నారు.

విద్యుదాఘాతంతో..



రాముడు (ఫైల్)

గద్వాల, మార్చి 14 : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని ఈడిగోనిపల్లిలో గురువారం ఉదయం ఓ వ్యక్తి విద్యుత్‌ఘాతంలో మృతి చెందాడు. ఎస్ఐ పర్వతాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాముడు(40) ఉదయం గ్రామంలోని ఓ హోటల్‌కు వెళ్లాడు. అక్కడ ఫ్యాన్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆసుపత్రికి చేరుకొని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కూడా కుటుంబసభ్యులను ఓదార్చారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



కొట్టె కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గ్రామ పంచాయతీ కార్మికులు

తెలకపల్లి, మార్చి 14 : మండల పరిధిలోని రాకొండ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కారోబార్ బాలరాజుపై అకారణంగా దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన కొట్టె కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ మహేష్ డిమాండ్ చేశారు. గురువారం తెలకపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులపై అనేక గ్రామాల్లో అకారణంగా దాడులు చేస్తున్నారని, ఈ దాడులను గ్రామపంచాయతీ యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు మల్టీపర్పస్ విధానంతో పని చేస్తున్నారని, వారికి ఎలాంటి అధికారాలు లేకున్నా గ్రామప్రజలు అర్థం చేసుకోకుండా వారిపై దాడి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా పోలీసులు విచారణ జరిపి కొట్టె కృష్ణయ్యపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఎంపీడీవో కార్యాలయం ముందు బాధితుడికి న్యాయం చేయాలని ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాస్‌లక్ష్మణ్, మండల అధ్యక్షుడు ఎండి.సైదులు, కార్యదర్శి లింగస్వామి, మండల నాయకులు సతీష్, వెంకటేశ్, రాములు, జాంగీర్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కల్వకుర్తి, మార్చి 14 : ఆర్యవైశ్యుల చిరకాల కోరిక ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం పొందడం పట్ల ఆర్యవైశ్యులు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం నేతలు జూలూరి రమేష్‌బాబు, శ్యాంసుందర్‌లు పుష్పగుచ్ఛం ఇచ్చి కలిశారు. ఈ సందర్భంగా పూల మాలలు, శాలువాలతో సీఎంను సత్కరించారు. సన్మానించిన వారిలో పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

గుండాలలో న్యాయాధికారుల ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న న్యాయాధికారులు శ్రీదేవి, కావ్య

వెల్దండ, మార్చి 14 : దక్షిణకాశీగా పేరుగాంచిన గుండాల అంబారామలింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం కల్వకుర్తి సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి, జూనియర్ సివిల్ న్యాయాధికారి కావ్యలు ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయానికి వెళ్లిన శ్రీదేవి, కావ్యలకు ఆలయ ఈవో ప్రసాద్, అర్చకులు సంతోష్, నరహరి, శివ, సూరి, బాలస్వామి, కృష్ణయ్యలతో పాటు స్థానిక నాయకులు పర్వత్‌రెడ్డిలు స్వాగతం పలికారు. అనంతరం వారు శివునికి అభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు న్యాయాధికారులను సత్కరించారు.

దేశ వ్యాప్తంగా రైతు రుణమాఫీ చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 14: దేశ వ్యాప్తంగా రైతాంగానికి రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, అకాల వర్షాలతో గత కొన్నేళ్లుగా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలో రైతులకు రాసిచ్చిన హామీలను అమలు చేయాలని, అరవై ఏళ్ల దాటిన రైతులకు పింఛన్ ఇవ్వాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు వి.వెంకటేష్, కేవీపీఎస్ నాయకుడు సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు రామయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'పీజీ సెంటర్‌లో మెస్ ప్రారంభించాలి'

కొల్లాపూర్, మార్చి 14 : పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని కొల్లాపూర్ పీజీ కళాశాలలో మెస్ వెంటనే ప్రారంభించాలని పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము అన్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం పీజీ కళాశాలలో రౌండ్ టేబుల్ సమావేశం బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు డి.ఈశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము హాజరై మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రారంభం నుంచి హాస్టల్స్ భవనాలు నిర్మించారు కానీ మెస్ ప్రారంభించడం లేదని దీని ద్వారా సుదూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు రెగ్యులర్‌గా హాస్టల్ రూమ్‌లో భోజనం తయారు చేసుకుని తరగతులకు సరైన సమయంలో హాజరు కాలేకపోతున్నారన్నారు. స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా నాయకులు దాసు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యూసుఫ్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు భరత్‌యాదవ్, ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్ల్ మార్క్స్ సిద్ధాంతం ఆచరణీయం

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి14: పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా కార్ల్ మార్క్స్ రాసిన దాస్ కాపిటల్ సిద్ధాంతం సమ సమాజ స్థాపనలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధికి ఆచరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ అన్నారు. గురువారం కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ప్రపంచ కమ్యూనిస్టు నేత కార్ల్ మార్క్స్ 141వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌ర్సింహ కార్ల్‌మార్క్స్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ, సీపీఐ నాయకులు శివశంకర్, మధుగౌడ్, గోపిచారి, రామస్వామి, శ్రీనివాసులు, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

● సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్ల్‌మార్క్స్ చిత్ర పటానికి ఆ పార్టీ మండల కార్యదర్శి అశోక్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం నాయకులు సత్యనారాయణ, సురేష్, శివరాం, నరేందర్‌రెడ్డి, మనోహర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్: శ్రామిక ప్రజల మార్గదర్శి సమసమాజ నిర్మాణ సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ అని సీపీఎం మండల కార్యదర్శి బి.శివవర్మ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం 141వర్ధంతిని కొల్లాపూర్‌లో సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. సీపీఎం నాయకులు పి.రాజు, జే.సురేందర్, బి.రాజు, భైరవ, శివ, చందు, రాము తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు ఎక్సైజ్ వేలం

కొల్లాపూర్, మార్చి 14 : పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం నిర్వహించిన వేలం పాట జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి గాయత్రి సమక్షంలో కొల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో నిర్వహించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి పేర్కొన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలను జిల్లా ఎక్సైజ్ అధికారి గాయత్రి సమక్షంలో వేలం వేయడం జరిగింది. ఇట్టి వేలంలో 5వాహనాలకు ప్రభుత్వం 57,500రూపాయలు నిర్ణయించారు. వేలం ద్వారా రూ70,600 రాగా, జీఎస్టీ రూ12,222 వచ్చినట్లు ఆయన తెలిపారు.

భయం వీడితేనే ఉత్తమ ఫలితాలు

వంగూరు, మార్చి 14: పరీక్షల సమయంలో విద్యార్థులు భయాన్ని వీడితే ఉత్తమైన ఫలితాలు సాధించవచ్చని ఎస్ఐ మహేందర్ అన్నారు. అమ్మ ఫౌండేషన్ వారి సమకారంతో గురువారం వంగూరులోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లను పంపిణీ చేశారు.

ప్రమాదభరితంగా మారిన రోడ్లు

వెల్దండ, మార్చి 14 : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు ప్రమాదభరితంగా మారాయి. ఇరుకుగా ఉండడంతో పాటు గుంతలమయంగా మారడం, రోడ్లకు ఇరువైపులా చెట్లు పెరగడంతో ఈ రోడ్లపై ప్రయాణమంటేనే వాహనచోదకులు వణుకుతున్నారు. మండల కేంద్రాలకు చేరడానికి వివిధ గ్రామాలనుంచి వచ్చేందుకు ప్రజలు వేరే మార్గాలలో వస్తుండడంతో దూరం పెరుగుతుందన్న విమర్శలు ఉన్నాయి. రోడ్ల సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు వేరే పట్టణాలకు వెళుతుండడంతో వ్యాపారాలు సైతం అంతంతమాత్రంగా జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మండల కేంద్రానికి వచ్చేందుకు బీటీ రోడ్లు ఏర్పాటు చేయాలని ఏళ్లకాలంగా స్థానికులు విన్నవించుకుంటున్నా ఫలితం కనిపించడంలేదు. కొత్త - వెల్దండ, పోతేపల్లి వయా కొత్త మీదుగా వెల్దండకు, రాచూరు, రాచూరు తండానుంచి వెల్దండకు, తిమ్మినోనిపల్లి తదితర గ్రామాలకు బీటీ రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వెల్దండ - రాచూరు రహదారి



సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

కొత్త రోడ్డును బీటీగా మార్చాలి



వెల్దండ నుంచి కొత్త గ్రామానికి వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలి. రోడ్డు సక్రమంగా లేకపోవడం, గుంతలమయంగా ఉండటంతోపాటు వర్షాకాలంలో కనీస ప్రయాణానికి సైతం తీవ్ర ఇబ్బందులు ఉన్నాయి. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో శ్రీశైలం ప్రధాన రహదారి మీదుగా మండల కేంద్రానికి ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి వస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- రవి, కొత్త గ్రామం

విద్యుత్ స్తంభం తొలగించకుండానే సీసీ రోడ్డు పనులు

చారకొండ: మండల పరిధిలోని జేపల్లి గ్రామంలో రోడ్డు మధ్యలో వున్న విద్యుత్ స్తంభాన్ని తొలగించకుండానే అసెంబ్లీ ఎన్నికల ముందు నాయకులు సీసీ రోడ్డు పనులు చేపట్టారు. దీంతో గ్రామస్థులకు, వాహనాలకు ఇబ్బంది కరంగా మారింది. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ధనదాహం కారణంగా విద్యుత్ స్తంభం తొలగించకుండానే సీసీ రోడ్డు వేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో ప్రజాధనం వృధా అయ్యిందని స్థానికులు పేర్కొంటున్నారు. సీసీ రోడ్డు మధ్యల ఉన్న విద్యుత్ స్తంభం తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం

- పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు,
- రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్, డివిజన్ స్థాయి కోలాట పోటీలు ప్రారంభం

అమ్రాబాద్, మార్చి 14: అమ్రాబాద్ ఉమ్మడి మండల పరిధిలోని రాయలగండి లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని గురువారం ఆలయ ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి దాశరధి మోహన్ బృందం ఆధ్వర్యంలో అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ అనురాధ దంపతులు ఆలయ కమిటీ చైర్మన్ ఇమ్మడి నరహరి, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శంకర్ నాయక్, సింగల్ విండో చైర్మన్ పోచం గణేష్, పదర జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు నాయక్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మోపతయ్య, రాజేందర్, రామలింగయ్య యాదవ్, హరి నారాయణ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ భీమా, బీజేపీ నాయకుడు మద్దెల పర్వతాలు, ఉమ్మడి మండల పరిధిలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులతో పాటు పెద్ద ఎత్తున హాజరైన భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. లక్ష్మీ చెన్నకేశవ స్వామికి కల్యాణోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ సమర్పించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయం ఆవరణలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను వంశీకృష్ణ ప్రారంభించారు. అలాగే అచ్చంపేట డివిజన్ స్థాయి కోలాటం పోటీలను కూడా ఇక్కడ నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వాలీబాల్, కోలాటం టీంలకు ప్రత్యేక బహుమతులను ఇవ్వనున్నారు. రాయలగండి లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలు మరో గ్రామాల నుంచి ఆలయం వద్దకు ప్రభల ద్వారా శుక్రవారం రాత్రి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుంటారు. ఈ మూడు రోజులు రాత్రివేళ సాంస్కృతిక, పౌరాణిక నాటకాలను ప్రదర్శించనున్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న డాక్టర్ వంశీకృష్ణ దంపతులు

విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలి

ఊర్కొండ, మార్చి14: నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 16న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పల్లె తిరుపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకుల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న విజయ సంకల్ప సభకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్రమోదీ రానున్నారు. బీజేపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్, నాయకులు పరుశ రాములు, రాజేందర్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, ఆంజనేయులు, శేఖర్‌రెడ్డి, గణేష్ తదితరులు ఉన్నారు.

● తెలకపల్లి: మోదీ సభను విజయవంతం చేయాలని జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడు రమణారెడ్డి అన్నారు. గురువారం మండల బీజేపీ ముఖ్య నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 16న ఉదయం 10గంటలకు నాగర్‌కర్నూల్‌లో ప్రధాని నరేంద్రమోదీ విజయ సంకల్ప సభ మీటింగ్‌కు జన సమీకరణ గురించి బూత్ స్థాయి సమావేశం యోగా భవన్‌లో నిర్వహించారు. మండల అధ్యక్షుడు గన్నోజు నరేంద్రచారి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కేవీ. రమణారెడ్డి, మండల ఇన్‌చార్జి జాకీర్ హుసేన్, మండల ప్రధాన కార్యదర్శి బాబుసాగర్, కృష్ణ, రాజు, శివ, వెంకటేష్, రాజారెడ్డి, కుర్మయ్య భాస్కర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, హుసేన్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి : నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం బీజేపీ గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, బూత్ కమిటీ ఇన్‌చార్జిలు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ గెలుపు కోసం ఏర్పాటు చేసిన విజయ సంకల్ప సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్నారని, ప్రతీ గ్రామం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా చూడాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి కృష్ణగౌడ్, ఎంపీటీసీ నర్సిరెడ్డి, బీజేపీ నాయకులు రాంచంద్రారెడ్డి, ఎన్.శేఖర్‌రెడ్డి, శ్రీశైలం, అశోక్‌రెడ్డి, మల్లేష్, గంగాధర్, శ్రీను ఉన్నారు.

● వెల్దండ : మోదీ విజయసంకల్ప సభకు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరిలు కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ విజయసంకల్ప సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా రానున్నారని వారు పేర్కొన్నారు. నాయకులు శ్రీనివాసాచారి, బాలస్వామి, మదుసూదన్ రెడ్డి, రాంరెడ్డి, చక్రవర్తిగౌడ్, విశ్వధర్‌రెడ్డి ఉన్నారు.



బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న పల్లె తిరుపతి

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

తెలకపల్లి, మార్చి 14 : మండల పరిధిలోని బొప్పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు విద్యాబోధన చేశారు. డీఈవోగా బి.శిరీష, ఎంఈవోగా బిందుశ్రీ, హెచ్‌ఎంగా రక్షితతో పాటు 19మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కాంపెక్స్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, ఆలేరు హెచ్‌ఎం. సత్యనారాయణ, బాలయ్య, పాఠశాల హెచ్‌ఎం ఎం.కుమార్, ఉపాధ్యాయులు టి.శ్రీనివాసులు, సునీల్‌కుమార్, శ్రీనివాసులు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటు

ఊర్కొండ, మార్చి 14: మండలంలోని ఊర్కొండపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రవణ్ కుమార్ తెలిపారు పాఠశాల ఆవరణలో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, మద్యం సేవించి అక్కడే సీసాలు వేయడం జరుగుతున్నదని అన్నారు. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవపోవడంతో పాఠశాల గ్రాంట్స్ నుంచి 7 సీసీ కెమెరాలు 30 వేల విలువగలవి అమర్చినామని తెలిపారు.

'ప్రధాని మోదీతోనే సంక్షేమం, అభివృద్ధి'

కొల్లాపూర్, మార్చి 14 : ప్రపంచ దేశాలు మెచ్చిన భారతదేశ ప్రధాని నరేంద్రమోదీ రాకతో నాగర్‌కర్నూల్ జిల్లా అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతుందని బీజేపీ మండల అధ్యక్షుడు తమటం సాయికృష్ణగౌడ్ పేర్కొన్నారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ నాయకులు శేఖర్‌గౌడ్, కేతూరి నారాయణలతో కలిసి తమటం సాయికృష్ణగౌడ్ విలేకర్లతో మాట్లాడారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఓర శేఖర్, భరత్‌కుమార్, శివకుమార్, రమేష్, బాలకృష్ణ, జగపతిరావు, మల్లయ్య, మౌలాలి, శ్రీరాములు, రాజశేఖర్, మదన్, కృష్ణయ్య స్వామి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'ధరణి సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలి'

మన్ననూర్, మార్చి 14: చెంచులు ధరణిలో భూసంబంధ సమస్యల పరిష్కారానికి ఈ నెల 17 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోహిత్ గోపిడి గురువారం తెలిపారు. నల్లమల అభయారణ్య ప్రాంతంలో ఉండే చెంచులు, మైదాన ప్రాంత చెంచులు తమ భూమి హక్కు పత్రాల్లో తప్పులున్నా, భూపరిష్కారం పెండింగ్‌లో ఉన్నా మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాని అన్నారు. ఈ నెల 16 వరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈ నెల 17న జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి కలెక్టర్ సమక్షంలో భూ సమస్యలు పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు.

పద్మశాలి, ముదిరాజ్ కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం

అచ్చంపేట, మార్చి 14 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలి, ముదిరాజ్ కార్పొరేషన్లు ఏర్పాటుపై గురువారం అచ్చంపేట పట్టణానికి చెందిన పద్మశాలి సంఘం నాయకులు కోట కిషోర్, అదే విధంగా ముదిరాజ్ సంఘం నాయకులు రాజు, తిర్పుతయ్య, బాలస్వామి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్డి సంఘం నాయకుల హర్షం

● ఉప్పునుంతల : కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై గురువారం ఉప్పునుంతల రెడ్డి సంఘం నాయకులు చీమర్ల బుచ్చిరెడ్డి, రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రెడ్డి సంక్షేమం అభివృద్ధికి తోడ్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

● లింగాల : రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల గురువారం లింగాలలో సంబరాలు జరుపుకున్నారు. ముదిరాజ్ మహా సభ మండల శాఖ అధ్యక్షుడు కొండమోని సత్యం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సంఘం నాయకులు లక్ష్మయ్య, సైదులు, శివ, శాంతయ్య, ప్రవీణ్, నిరంజన్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

తిమ్మాజిపేట, మార్చి 14 : విద్యార్థులు పదిలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జీహెచ్‌ఎం సత్యనారాయణశెట్టి సూచించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు పొందాలన్నారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, కిరణ్, అమర్, నవీన్, అనిత, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రపంచ గ్లాకోమా వారోత్సవాల నాల్గవ సదస్సు



ర్యాలీ నిర్వహిస్తున్న శాంతినికేతన్ జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు

తెలకపల్లి, మార్చి 14 : తెలకపల్లి మండల కేంద్రంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్రత్వంలో కూచకుళ్ల రామచంద్రారెడ్డి తూడుకుర్తి వారి ఆధ్వర్యంలో గురువారం శాంతినికేతన్ హైస్కూల్ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌వీ.ప్రసాద్ కంటి వైద్యులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆరు నెలలకొకసారి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. నేత్ర వైద్యులు డాక్టర్ శ్రావ్య, ప్రేమ్‌కుమార్, కే.రాజు, కే వెంకటయ్య, ఆంజనేయులు, శంకర్, బాస్కర్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలి'

పెంట్లవెల్లి, మార్చి 14 : ఉపాధి హామీ పనుల్లో ఆరు వారాల పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గోప్లాపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులుగా ఉపాధి హామీ డబ్బులు వేయకపోవడంతో కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కష్టపడి పని చేసినా డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ డబ్బులు పడకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని వారన్నారు. రోజు గడిస్తే గాని పూట గడవని కూలీల పరిస్థితి దయనీయంగా ఉందని వారు పేర్కొన్నారు. ఉపాధి కూలీలు రామకృష్ణ, గిరి, మంగమ్మ, పుల్లమ్మ, కిష్టయ్య, లక్ష్మీ పాల్గొన్నారు.

చెంచు పెంటలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

లింగాల, మార్చి 14: మండల పరిధిలోని చెంచు పెంటలను గురువారం అచ్చంపేట ఆర్డీవో మాధవితో పాటు లింగాల తహసీల్దార్ ఉమా సందర్శించారు. ఈ సందర్భంగా ఉప్పాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అప్పాపూర్ పెంట, రాంపూర్, మేడిమల్కాల, సంగడిగుండాల, పుల్లాయపల్లి తదితర చెంచు పెంటలను వారు సందర్శించి త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు గాను ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు పూర్తి స్థాయిలో సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని వారు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

తిమ్మాజిపేట, మార్చి 14 : రైతుకు విక్రయించే ఎరువులు, విత్తనాలు క్రిమిసంహారక మందులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ సూచించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ రికార్డులను పరిశీలించి యజమానికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువులు, అమ్మకాలు జరగాలన్నారు. షాపులో నిల్వ ఉన్న రైతుకు అమ్మిన ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతుకు ఎరువులు క్రిమిసంహారక మందులు విత్తనాలు అమ్మితే రసీదు ఇవ్వడం తప్పనిసరి అన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

వంగూరు, మార్చి 14: గంగపుత్ర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటిచడం పట్ల ఆ సంఘం నాయకులు హర్షిస్తూ గురువారం మండలంలోని రంగాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గంగపుత్రుల సంఘం నాయకులు రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అల్లె నాగరాజు, శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కల్వకుర్తి, మార్చి 14 : వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ ఉపాధ్యక్షుడు జూలూరి రమేష్ బాబు సహకారంతో కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్‌లో పేదలకు అన్నదానం నిర్వహించారు. రమేష్‌బాబు పెళ్లిరోజు సందర్భంగా పేదలకు అన్నదానంతో పాటు మార్చాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు గణిత పరీక్ష నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్, క్లాస్‌మేట్‌క్లబ్ నాయకులు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్ల పర్యవేక్షణ

అచ్చంపేట రూరల్, మార్చి 14 : అచ్చంపేట మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో ఐదు లక్షల రూపాయలతో 140 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం పనులను గురువారం అచ్చంపేట పంచాయతీరాజ్ డీఈ వి.చంద్రకళ, ఏఈ జి.సందీప్‌రెడ్డిలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ పనులు..

అచ్చంపేట మండల పరిధిలోని హాజీపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన లాండ్ లెవలింగ్ పనులను గురువారం అచ్చంపేట ఎంపీడీవో ప్రోగ్రామ్ ఆఫీసర్ బాలచంద్రసుజన్ పర్యవేక్షించారు. ఈ పథకంలో మొత్తం 88మందికి ఉపాధి కల్పించినట్లు ఆయన తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ మురళి, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచాలి

ఉప్పునుంతల, మార్చి 14 : ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో లక్ష్మణ్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని తాడూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో కూలీలు పనిచేసే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత పెరుగుతుంది కాబట్టి ఉదయం 7 గంటలకు వెళ్లి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పనులు చేపట్టాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఏపీవో సుదర్శన్‌గౌడ్, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కల్వకోల్ వాసికి పురస్కారం



ప్రముఖ కవి, రచయిత రఘువీర ప్రతాప్‌ను శాలువాతో సన్మానిస్తున్న రచయితలు, కవులు

పెద్దకొత్తపల్లి, మార్చి 14 : మండల పరిధిలోని కల్వకోల్ గ్రామానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు ఎస్‌వీ.రఘువీర ప్రతాప్ సాహిత్య రంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తిస్తూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు బుధవారం కీర్తి పురస్కారానికి ప్రకటించారు. ఈ పురస్కారం ప్రకటించడంపై కొల్లాపూర్‌కు చెందిన కవులు, రచయితలు హర్షం ప్రకటించి ఆయనను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ తెలుగు కవుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వేదార్థం మధుసూదన్‌శర్మ, డైరెక్టర్ గూడెల్లి శీనయ్యలు మాట్లాడారు. రఘువీర ప్రతాప్ రచన, కవితంలో కవితాంజలి, అమ్మంటే, చిగురాశల గుహలలో, నానీల ప్రక్రియలో అంతర్వాహిని, నానీల ముత్యాలు, గజల్ ప్రక్రియలో గజల్ జ్యోత్స్న, మహోన్నత వృక్షాలు, విశ్వ రహస్య విశేషం, రెక్కల ప్రక్రియలో పరిస్రాలోకం, రుబాయిల ప్రక్రియలో కావ్య మాధూలిక, మణిపూసల ప్రక్రియలో మనోసంద్రాన, హైకూల ప్రక్రియలో కవనొన్మీలనం మొదలైన అనేక గ్రంథాలను ప్రచురించారని వారు పేర్కొన్నారు. కల్వకోల్ గ్రామవాసి నారాయణదాసు శ్రీరామాచార్యులు, వెంకటశేషమ్మల సంతానమైన రఘువీర్ ప్రతాప్ ప్రస్తుతం నల్గొండ జిల్లా అటవీ శాఖలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొల్లాపూర్ ప్రాంతం నుంచి ఆయన ఈ కీర్తిపురస్కారం అందుకోవడం కొల్లాపూర్ ప్రాంతానికే కాక నాగర్‌కర్నూల్ జిల్లాకు గర్వకారణమన్నారు. కొల్లాపూర్ సీనియర్ నాయకులు కవులు పెద్దూరి వెంకటదాస్, తెలుగు భారతి సంస్థ అధ్యక్షులు ఆమని కృష్ణ, కవులు, రచయితలు వేముల కోటయ్య, గడ్డికోపుల పరుశరాముడు, డాక్టర్ భైరోజు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.